క్లుప్తంగా

ఉక్కు అధికారి ఔదార్యం

● 55వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం డీసీఎం కర్రి శ్రీనివాస్

అక్కిరెడ్డిపాలెం: ఆపదలో ఉన్న వారికి రక్తం అందించి శభాష్ అనిపించుకుంటున్నారు ఉక్కు అధికారి. ఒక చిరు వ్యాపారికి రక్తం ఇచ్చి ప్రాణాలు కాపాడారు. ఇప్పటి వరకూ 55 సార్లు రక్త దానం చేసి ఎందరో ప్రాణాలు కాపాడారు స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం డీజీఎం కర్రి శ్రీనివాస్. షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో అమలాపురానికి చెందిన చిరు వ్యాపారి దుర్గా నారాయణకు ఆదివారం కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగింది. అతనికి ఓ నెగెటివ్ రక్తం అవసరమైంది. దీంతో అతని కుటుంబీకులు రక్తదాత కోసం వెతుకులాట మొదలు పెట్టారు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ వెంటనే స్పందించి ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. దీంతో వ్యాపారికి ఆపరేషన్ విజయవంతం అయ్యింది. శ్రీనివాస్‌కు దుర్గానారాయణ కుటుంబీలు కృతజ్ఞతలు తెలిపారు.

బ్రెయిన్ ట్యూమర్లపై అవగాహన అవసరం



డాక్టర్ నాయుడు

అక్కిరెడ్డిపాలెం: బ్రెయిన్ ట్యూమర్లపై అవగాహన పెంచుకోవాలని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ కె.అచ్చియ్య నాయుడు అన్నారు. అంతర్జాతీయ బ్రెయిన్ ట్యూమర్ డేను పురస్కరించుకుని ఆదివారం ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్రెయిన్ ట్యూమర్ అంటే మెదడులో ఏర్పడే అసాధారణ సెల్ పెరుగుదల అని వివరించారు. ఇవి మాల్గినెంట్ (క్యాన్సర్) లేదా బెనైన్ (క్యాన్సర్ కానివి) కావచ్చు అన్నారు. బ్రెయిన్ ట్యూమర్ లక్షణాలు తొందరగా గుర్తించడం ద్వారా చికిత్స విజయవంతంగా ఉండే అవకాశాలు పెరుగుతాయన్నారు. తీవ్రమైన తలనొప్పి, ఉదయం ఎక్కువగా ఉండడటం, వాంతులు రావడం, చూపులో సమస్యలు, ఫిట్స్ రావడం, సమతుల్యత లోపించడం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుని సంప్రదించాలని సూచించారు. తద్వారా పూర్తి వైద్యం పొంది తక్కువ కాలంలో కోలుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు.

ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో శ్రీ చైతన్య హవా





గ్రీష్మిక బగాది భార్గవ్ వంశీ కృష్ణ

ఉక్కునగరం: ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో గాజువాక జోన్ శ్రీ చైతన్య విద్యార్థులు సత్తా చాటారు. గురు కీర్తన 34వ ర్యాంకు, కాండ్రేగుల గ్రీష్మిక 274 వ ర్యాంకు, బగాది భార్గవ్‌కు 300 ర్యాంకు, రుత్తల వంశీ కృష్ణ 307 ర్యాంకు, కె.రుతుజాశ్రీ 349వ ర్యాంకు, సంపంగి హేమ హవిల్ 349వ ర్యాంకు, వియ్యపు జయశ్రీ 386వ ర్యాంకు సాధించినట్టు ఎగ్జిక్యూటివ్ ఏజీఎం రమణ తెలిపారు. మొత్తం 1000లోపు ర్యాంకులు సాధించిన వారు 25 మంది ఉన్నారు. వీరిని ఎగ్జిక్యూటివ్ డీన్లు ఎస్.రఘు కుమార్, కె.బంగారు బాబు, ఏజీఎం పి.శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

ఇగ్నో కోర్సులతో ప్రయోజనం



సమావేశంలో మాట్లాడుతున్న మృత్యుంజయ బెహరా

గాజువాక: ఇందిరా గాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) అందిస్తున్న కోర్సులతో ఎంతోమంది ప్రయోజనం పొందుతున్నారని కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్య మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ డాక్టర్ మృత్యుంజయ బెహరా అన్నారు. స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలోని ఇగ్నో స్టడీ సర్కిల్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ అమలు చేస్తున్న కోర్సులు, అభ్యసిస్తున్న విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రస్తుత సమాజానికి అవసరమైన స్కిల్ కోర్సుల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఇగ్నో సీనియర్ రీజనల్ డైరెక్టర్ ధర్మారావు, కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు, ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, కోఆర్డినేటర్ ఎస్.వి.కృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికల ముందు ఒక మాట. గెలిచాక ఇంకో మాట చెప్పడం.. హామీలను తుంగలో తొక్కడంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు మించిన వారు లేరని పేద ప్రజలు చర్చించుకుంటున్నారు.కూటమి నాయకులు చెప్పిన మాటలకు అన్ని వర్గాల మాదిరిగానే తాము మోసపోయామని పలువురు ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి నాయకులు అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఆటో, ట్యాక్సీ లైసెన్స్ కలిగిన డ్రైవర్లకు ప్రతి సంవత్సరం రూ. 15వేల ఆర్థిక సాయం అందిస్తామని.. ప్రమాద బీమా, ఆరోగ్య బీమా కల్పిస్తామని ఎన్నికల సమయంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా ఈ హామీ అమలుకు నోచుకోలేదు. ఇచ్చిన మాట ప్రకారం కనీసం ఆర్థిక సాయమైనా అందించాలని కోరుతున్నారు.

– పెదగంట్యాడ

ఆటోవాలాకు మిత్ర ద్రోహం



స్టాండ్ వద్ద ఆటోలు

- వాహనమిత్ర మాటే ఎత్తని సర్కార్
- ఎన్నికల ముందు రూ.15 వేలు ఇస్తామని హామీ

గాజువాక నియోజకవర్గ పరిధిలో సుమారు 3 వేలకు పైగా ఆటోలు ఉన్నాయి. చదువు లేనివారు.. చదువుకుని ఉద్యోగం రాని అనేక మంది ఆటోలనే నమ్ముకుని జీవితాలు గడుపుతున్నారు. పెరిగిన డీజిల్ ధరలు, నిత్యావసరాల ధరలు.. నిత్యం పోలీసుల వేధింపుల కారణంగా రోజంతా కష్టపడినా వచ్చే కొద్దిపాటి సంపాదనతో కుటుంబాలు గడవక ఇబ్బందులు పడుతున్నారు. ఆటో డ్రైవర్ల కష్టాలను గుర్తించిన గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాహన మిత్ర పేరుతో ఏడాదికి రూ..10వేల చొప్పున ఐదేళ్లు క్రమం తప్పకుండా ఒక్కో ఆటో డ్రైవర్‌కు రూ.. 50 వేలు అందించారు. వారికి కొంతమేర ఉపశమనం కల్పించారు.

కూటమి రాకతో ఆర్థిక సాయం నిలిపివేత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక సాయాన్ని నిలిపివేసింది. మరో వైపు కేసులతో వేధిస్తోందని ఆటో డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం వాహనమిత్ర పథకం కింద ఏటా రూ. 10వేలు ఆర్థిక సాయం ఎంతో ఉపయోగకరంగా ఉండేదని చెబుతున్నారు. ప్రస్తుతం ఆర్థిక సాయం అందించక పోగా పోలీసులు తనిఖీల పేరుతో భారీగా జరిమానాలు విధిస్తుండంతో ఆటోలు రోడ్లపైకి తెచ్చి నడపాలంటే డ్రైవర్లు హడలిపోతున్నారు. కనీసం ఇచ్చిన మాట ప్రకారం వాహన మిత్ర చెల్లించాలని కోరుతున్నారు.

తగ్గిన ఆదాయం

ఆటో నిర్వహణకు సాధరణ ఖర్చులుంటాయి. ప్రస్తుతం పెరుగుతున్న డీజిల్, పెట్రోల్ ధరలతో ఆటో కార్మికులకు రోజంతా కష్టపడితేరూ. 300 మిగిలని పరిస్థితి కొందరిది. దీంతో పాటు ప్రతి సంవత్సరం ఫిటినెస్, ఇతర పత్రాల కోసం దాదాపు రూ. 15 వేల వరకూ ఖర్చవుతోందని అవేదన వ్యక్తం చేస్తున్నారు. తీసుకున్న నెలవారీ వాయిదాలు కట్టుకోలేక ఆటో కార్మికుల బతుకులు దిన దిన గండంగా మారిపోయాయి.

గత ప్రభుత్వంలో భరోసా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఏటా కోట్ల రూపాయిల బడ్జెట్ కేటాయించేది. అర్హులైన ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ. 10వేలు వారి ఖాతాల్లో జమ చేసింది. దీంతో పాటు వాహన డ్రైవర్ ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షలు బీమా అందించే వారు. అలాగే రవాణా వాహనం కొనుగోలుకు రుణాలు ఇచ్చి వడ్డీ రాయితీ అందించి భరోసా కల్పించింది.

కుటుంబ పోషణ భారం



రోజంతా కష్టపడి ఆటో నడిపినా కుటుంబ పోషణ కష్టంగా మారింది.. నిత్యావసర సరకులతో పాటు ఇంధన ధరలు పెరిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికలకు రూ.15 వేల చొప్పున అందించాలి.

–ఆర్. కృష్ణబాబు, ఆటో కార్మికుడు, పెదగంట్యాడ

ప్రభుత్వమే ఆదుకోవాలి



గతంలో మాకు వాహన మిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ. 10వేల చొప్పున ఐదేళ్ల పాటు 50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆ సొమ్మును ఆటో మరమ్మతులు, ఫిటినెస్‌కు ఉపయోగించుకునేవారం. ప్రస్తుత సర్కార్ ఆర్థిక సాయం అందించడం లేదు.మాలాంటి పేదలకు సంక్షేమ పథకాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– వి. రాంబాబు, ఆటో కార్మికుడు, పెదగంట్యాడ

ఉక్కు దీక్షల్లో భెల్ ఉద్యోగులు



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న భెల్ సీఐటీయూ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన 1532వ రోజు రిలేదీక్షల్లో ఆదివారం భెల్ సీఐటీయూ నాయకులతో పాటు విశాఖ డెయిరీ ఉద్యోగులు పాల్గొన్నారు. సీఐటీయూ ప్రధానకార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ కార్మికులు ప్రజల పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ అమలు చేసిందన్నారు. ఈ ప్యాకేజీ వల్ల ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనం లేకపోగా నిరాశే మిగిల్చిందన్నారు. ప్యాకేజీలో అధికభాగం బ్యాంకు లోన్లు, జీఎస్టీ రూపంలో తిరిగి ప్రభుత్వానికి చేరిందన్నారు. కార్మికవర్గానికి, స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు ఎటువంటి ప్రయోజనం కలగలేదని అన్నారు. కార్మికులకు సక్రమంగా జీతాలు చెల్లించి, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి, సొంత గనులు కేటాయిస్తే కార్మికులకు ప్రయోజనం ఉంటుందన్నారు. డెయిరీ ప్రధాన కార్యదర్శి ఎస్.రమణ, అధ్యక్షుడు వరహామూర్తి, భెల్ సీటు నాయకులు ఎస్.జగన్నాథరావు, కె.నారపురెడ్డి, పి.శివరాం, జి.అచ్చిలినాయుడు పాల్గొన్నారు.

నేడు పైడితల్లి తొలేళ్లు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి తొలేళ్ల పండగ సోమవారం జరగనుంది. అమ్మవారి పూజారి వంశస్తుల ఆధ్వర్యంలో రాత్రి గంట దీపాల ఉత్సవాన్ని నిర్వహిస్తారు. తొలేళ్లను పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో మార్కెట్‌లోని పుష్కరిణి సత్రం వద్ద రాత్రి 7 గంటల నుంచి నృత్యప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

సీనియర్ సిటిజన్స్ యోగా సాధన



భెల్ క్రీడా మైదానంలో యోగా సాధనలో సీనియర్ సిటిజన్స్

అక్కిరెడ్డిపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లి కోరారు. భెల్ క్రీడా మైదానంలో వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం యోగాంధ్ర – 2025 సీనియర్ సిటిజన్స్‌తో యోగా సాధన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ యోగాను జీవన శైలిలో భాగం చేసుకోవాలన్నారు. అంతర్జాతీయ యోగా డేను నెల రోజుల ముందుగానే చేపట్టడం జరిగిందన్నారు. భెల్ వాకర్స్ క్లబ్ యోగాంధ్ర –2025 వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈరుపుగంటి అనార్‌బాబు, కార్యదర్శి కె.భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యోగా ట్రైనర్ డాక్టర్ పసుపులేటి లక్ష్మణరావు, ఆయుష్ విభాగం డాక్టర్ హరికృష్ణ, మింది హోమియోపతి హాస్పటల్ వైద్యురాలు డాక్టర్ ఆర్.శ్రీదేవి, ఏయూ యోగా విభాగం ట్రైనర్ కె.తేజా భాస్కరరావు, ఇంటక్ నాయకుడు ఊరుకూటి బాబూరావు, యోగా విభాగం శిక్షకుడు జి.అఖిల్ సూర్యతేజ, బీహెచ్‌పీవీ వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ మెంబర్ నామాన సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.



యోగా సాధకులనుద్దేశించి మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీవల్లి

సత్ప్రవర్తనతో నడుచుకోండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కంచరపాలెం సీఐ చంద్రశేఖర్

మర్రిపాలెం: ఎటువంటి తగాదాలు, గొడవల జోలికి పోకుండా రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని కంచరపాలెం ఐదో పట్టణ సీఐ చంద్రశేఖర్ సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు ఎటువంటి అఘా యిత్యాలు, కొట్లాటల జోలికి వెళ్లినా ఊరు కునేది లేదని హెచ్చరించారు. వారిపై ఎల్లప్పు డూ నిఘా ఉంటుందని, హద్దు మీరి ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు. మంచిగా మెలగాలని, కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జీవించాలని రౌడీషీటర్లకు సీఐ సూచించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

తాటిచెట్లపాలెం: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ చిన్నంనాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు ఎటువంటి గొడవల్లో తలదూర్చకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. హద్దు మీరితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

విద్యాహక్కు చట్టం పటిష్టంగా అమలు చేయాలి

సీతంపేట: విద్యా హక్కు చట్టం–2009ను పటిష్టంగా అమలు చేయాలని రైట్ ఎడ్యుకేషన్ ఫోరం కన్వీనర్ నరవ ప్రకాశరావు డిమాండ్ చేశారు. సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో విద్యా హక్కు చట్టం అమలు తీరుపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజుల నియంత్రణ చట్టం కఠినంగా అమలు చేయాలని కోరారు. విద్యా వ్యవస్థను కాపాడుకునేందుకు తల్లిదండ్రులు సమైఖ్యంగా పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధాన ప్రకటన చేయాలని, ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల్లోని నోటీస్ బోర్డుల్లో ఫీజుల వివరాలు ఉండేలా ప్రభుత్వం ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు. డ్రాప్ అవుట్స్ తగ్గించేలా, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు, సామాజిక వేత్తలు కరుణ, విశ్వనాథం, హుస్సేన్, పి.సి.రావు, సత్యవతి, నరసింహారావు, చాట్ల బాబూరావు రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫోరం కన్వీనర్ నరవ ప్రకాశరావు

వెరైటీ 'టీ'



మండలంలో ఓ టీ దుకాణం వద్ద సందడి



ఇరానీ చాయ్ పేరుతో టీ దుకాణం

- రకరకలా పేర్లు, ఫ్లేవర్లతో లభ్యం
- జనాలను ఆకట్టుకుంటున్న నిర్వాహకులు

పెదగంట్యాడ: ఉరుకులు పరుగులు జీవితంలో టీ ఓ భాగమైపోయింది. కొద్దిపాటి సమయం దొరికినా, నలుగురు కలిసినా చాయ్ తాగుతూ స్నేహితులతో గడుపుతుంటారు. దీంతో టీ కి విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. దీనికి తగ్గట్టుగానే రకరకాల పేర్లతో మండలంలో వీధి వీధినా టీ షాపులు వెలుస్తున్నాయి. వివిధ ఫ్లేవర్లను అందిస్తూ అన్ని వయసుల వారిని నిర్వాహకులు ఇట్టే ఆకట్టుకుంటున్నారు. దీంతో ఏటీ షాపు చూసినా విపరీతమైన రద్దీగా ఉంటుంది.

120కి పైగా..

మండలంలో చాయ్ దుకాణాల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. పెదగంట్యాడ మండల పరిధిలోనే 120కు పైగా టీ షాపులన్నాయి.

రకరకాల పేర్లు, ఫ్లేవర్లు

ఇరానీ చాయ్, చాయ్ క్లబ్, టీ ట్రీ, టీ టైం, అల్లం టీ, పుదీనా, లెమన్, జింజర్, బెల్లం టీ, గ్రీన్ టీ ఇలా పలురకాల పేర్లు, ఫ్లేవర్లతో జనాలను ఆకట్టుకుంటున్నారు. ఉదయం 5.30 నుంచి రాత్రి 9 వరకూ ఈ షాపుల వద్ద జనం కిటకిటలాడుతున్నారు. పెద్ద హోటళ్లకు వెళ్లి టీ, కాఫీలు తాగాలంటే భారీగా సమర్పించాలి. ఇదే కొత్తగా వెలసిన టీ స్టాల్స్‌లో రూ.10 నుంచి రూ. 15 కే టీ, రూ.20 నుంచి రూ.25కి కాఫీ వస్తుంది. దీంతో అందరూ వీటికే మక్కువ చూపుతున్నారు.

మధుర స్మృతులు



పూర్వ విద్యార్థుల గ్రూప్



సందడి చేసిన గాయకుడు మల్లికార్జున్



హేయ్ నేనే... ఇది నువ్వే... పాతచిత్రాల్లో సంతోషాలు వెతుకుతున్న పూర్వ విద్యార్థులు

- అపూర్వంగా 1990–91 బ్యాచ్ విద్యార్థుల కలయిక
- పాఠశాల అభివృద్ధికి దోహదపడాలని తీర్మానం

గోపాలపట్నం: ఆ నాటి ఆ స్నేహ గీతాలు గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వెల్లివిరిసాయి. స్నేహితులంతా కలసి నాటి మధుర స్మృతుల్ని గుర్తుకు తెచ్చుకుని ఆనందాలు పంచుకున్నారు. అమరికలు లేని సంతసాల పూలు వికసించి పరిమళాలు వెదజల్లాయి. దీనికి తోడు ప్రఖ్యాత గాయకుడు మల్లికార్జున్ పాటలు ఆటలు మరింత ఉత్సాహాన్ని తెచ్చి పెట్టాయి. ఆదివారం జరిగిన ఈ సందడికి గోపాలపట్నం బాలికల హైస్కూల్ వేదిక యింది. 1990–91 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు కలిసిన సందర్భం వారి జ్ఞాపకాల పుటల్లో ప్రత్యేక పేజీగా నిలిచింది. యూనియన్‌గా ఏర్పడి అందరిని కూడగట్టారు. సమయం అనుకుని కలిశారు. ఇందుకు సహకరించిన సహచర సభ్యులకు కమిటీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే గణబాబు హాజరయ్యారు. పూర్వ విద్యార్థులను అభినందించారు.

ప్రత్యేక ఆకర్షణగా సింగర్ మల్లికార్జున్

నేపథ్య గాయకుడు బోడ మల్లికార్జున్ ఆత్మీయ కలయికలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నాటి స్నేహితులను కలవడం.. అందరినీ పేర్లతో పిలవడంతో చాలా మంది ఉబ్బితబ్బియ్యారు. థియేటర్లో సినిమాలు చూసి పాటలు పాడేవాడినని గుర్తు చేసుకున్నారు. పలు సినిమాల్లో పాడిన పాటలు పాడి ఉర్రూతలూగించారు. తన మిత్రుడైన డ్యాన్స్ మాస్టర్ శివశంకర్‌తో కలసి స్టెప్పులేశారు. తనకు చిన్నాటి మిత్రుడు శివశంకర్‌ని పరిచయం చేశారు.

ఉపాధ్యాయులను సత్కరించిన విద్యార్థులు

గోపాలపట్నం హెచ్ఎం స్వర్ణలతతో పాటు వీరు చదువుకునే సమయంలో పని చేసిన అటెండర్ చంద్రకళను ఘనంగా సత్కరించారు. కార్యక్రమం ఘనంగా జరిగేందుకు సహకరించిన సహచరులు సూర్యనారాయణ, చెక్కా శేషగిరి, నర్సింహమూర్తి తదితరులను అభినందించారు. కార్యక్రమంలో పైడిరాజు, సురేష్, శ్రీనివాసరావు, దేవి, దీప్తి, కిషోర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వుడాకాలనీలో సమస్యల తిష్ట

కూర్మన్నపాలెం: రాజీవ్‌నగర్ వుడా కాలనీలో సమస్యలు తిష్టవేశాయి. దీంతో కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా వుడాకాలనీ ఫేజ్ –1లో గొయ్యిలు వాటి చుట్టూ ముళ్లపొదలు.. రహదారులు శిథిలం కావడంతో అక్కడి వారు ఆందోళన చెందుతున్నారు. మంచి నీరు సరఫరా చేసే వాల్వ్‌ల కోసం తీసిన గొయ్యిలు ఎంతో కాలం నుంచి అలాగే వదిలేశారు. దీంతో ఆ గోతుల చుట్టూ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో అటుగా వెళ్లే చిన్న పిల్లలు పడిపోయే ప్రమాదం ఉందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. సమస్యల పై అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందని వారు వాపోతున్నారు. కూర్మన్నపాలెంలో మెదటి వుడాకాలనీ తమదేనని.. అయినా వసతులు కల్పించడం లేదని నివాస సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు అన్నారు. కనీసం కమ్యూనిటీ సెంటర్ నిర్మించాలని విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లు మరమ్మతులు చేపట్టడంతో పాటు కమ్యూనిటీ హాలు నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



మంచినీటి సరఫరా వాల్వ్‌కోసం తీసిన గొయ్యి ఇలా



వుడానగర్ ఫేజ్ - 1లో ప్రమాదాలకు నిలయంగా మారిన గొయ్యి